అమ్మకానికి క్రీడా స్టేడియం

- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్న అమీర్‌పేట గురుగోవింద్‌సింగ్ స్టేడియం
- స్టేడియం నిర్వహణపై చేతులెత్తేసిన అధికారులు
- ఇప్పటికే టెండర్లకు ఆహ్వానం
- జీహెచ్‌ఎంసీ నిర్ణయంపై ఆవేదన వ్యక్తం చేస్తోన్న క్రీడాకారులు


అమీర్‌పేటలోని గురుగోవింద్‌సింగ్ మల్టీపర్పస్ క్రీడా స్టేడియం

అమీర్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తూ పలు క్రీడలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న అమీర్‌పేటలోని గురుగోవింద్ సింగ్ మల్టీపర్పస్ క్రీడా స్టేడియం నిర్వహణ జీహెచ్‌ఎంసీకి భారంగామారింది. ఈ క్రమంలో దీన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు టెండర్లు ఆహ్వానించడం క్రీడాకారులను ఆందోళనకు గురిచేస్తోంది. అమీర్‌పేటలోని ధరంకరం రోడ్డులో 2005లో నిర్మించిన ఈ స్టేడియాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. ప్రముఖ క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చెందిన ఈ స్టేడియంలో ఇండోర్, అవుట్‌డోర్ ఆటలైన బ్యాడ్మింటన్, యోగా, కరాటే, బాక్సింగ్, క్రికెట్, వ్యాయామం, టెన్నిస్, హాకీ, స్కేటింగ్ వంటి వాటిల్లో నిరంతరం శిక్షణతో పాటు ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహిస్తుంటారు. అన్ని క్రీడలకు నిష్ణాతులైన కోచ్‌లు అందుబాటులో ఉండటంతో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు..సాయంత్రం 4 గంటల నుంచి 7.30 గంటల వరకు సందడిగా ఉంటుంది. ఇక్కడ సాధన చేసిన ఎంతో మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. నామమాత్రపు ఫీజులతో, ఉచిత వేసవి శిబిరాలతో ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఈ స్టేడియాన్ని ప్రైవేట్‌పరం చేయడాన్ని చాలామంది వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల క్రీడాకారులు, శిక్షణ పొందుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు స్టేడియం ఆవరణలో ఆందోళనకు దిగారు.

పథకం ప్రకారమే ప్రైవేటీకరణ

స్టేడియాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంలో భాగంగానే ఇటీవల క్రీడా సామగ్రి సరఫరా చేయడం లేదని, రెండేళ్లుగా ఈత కొలను సైతం మూసివేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.నిర్వహణ బాధ్యతలు అప్పగించడానికి గత నెలలో ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించారు. ఆసక్తి కలిగిన వారిని ఆకర్షించేందుకు స్టేడియానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు.

ఆందోళనలో కోచ్‌లు, క్రీడాకారులు

స్టేడియం నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే తమ భవిష్యత్తు ఏమిటని కోచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం స్టేడియంలో ఈతకు 6, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, కరాటే, యోగా బాక్సింగ్, జిమ్‌లకు ఒక్కో కోచ్ చొప్పున పనిచేస్తున్నారు. సుమారు 20 సంవత్సరాలుగా వేతనాలు లేకున్నా పిల్లలకు శిక్షణ ఇస్తున్నామని, స్టేడియం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే తాము రోడ్డున పడతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నామమాత్రపు ఫీజులతో శిక్షణ పొందుతున్న వారు ప్రైవేట్ పరమైతే ఫీజులు భారీగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత మనదే

- కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్


మొక్కను నాటుతున్న కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

బంజారాహిల్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ అన్నారు. శాలివాహన నగర్ కాలనీలో శనివారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ మొక్కలే వృక్షాలుగా మారి భవిష్యత్తు తరాలకు సహజవాయువును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న మంచుకొండ ఫౌండేషన్ సభ్యులు

మాజీ ప్రధాని పీవీ సేవలు మరువలేనివి

పంజాగుట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలు మరువలేనివని మంచుకొండ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంచుకొండ ప్రకాశం అన్నారు. శనివారం పంజాగుట్టలోని మంచుకొండ సంస్థల ప్రధాన కార్యాలయంలో పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నిర్వాహకులతో పాటు సంస్థ ఉద్యోగులు,"సిబ్బంది, యువత రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ.. సమాజ సేవలో అంతులేని ఆనందం ఉంటుందన్నారు. తరగని ఆస్తులు సంపాదించినా రాని ఆనందం సేవా కార్యక్రమాల ద్వారా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు ముని మనవరాలు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మధులిక, మంచుకొండ సంస్థల డైరెక్టర్లు రవికుమార్, సురేందర్, వరుణ్ కుమార్, అరుణ్ కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రవణ్ కుమార్, ఆదినారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వెంగళరావునగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి సహకారంతో శనివారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డి ఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన సలహాదారు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సివిల్స్ ప్రోగ్రాం లోగోను ఆవిష్కరిస్తున్న సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ, డాక్టర్ రాంబాబు, మంతెన శ్రీనివాసరాజు

విద్యార్థులకు నేర్చుకోవడం అనేది ముఖ్యమైన అంశం

పంజాగుట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నేర్చుకోవడం అనేది ముఖ్యమైన అంశమని సైబరాబాద్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. శనివారం వెంగళరావునగర్‌లోని నలంద విద్యాసంస్థల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నలంద విద్యా సంస్థలు, లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి ప్లస్ 2 వరకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్న సివిల్స్ ప్రోగ్రాంను ఆమె ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. ఎస్‌టీఈఎంఎస్‌ఎస్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, సొసైటీ, స్పోర్ట్స్) పాఠ్యాంశాల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, అకాడమీ చైర్మన్ డాక్టర్ రాంబాబు పాలడుగు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మహదేవ్ జీ జనకర్, అక్కి. సాగర్, రమాకాంత్ తదితరులు

తెలంగాణలో ఆర్‌ఎస్పీని బలోపేతం చేస్తాం

- పార్టీ జాతీయ అధ్యక్షుడు మహదేవ్ జీ జనకర్

పంజాగుట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతే రాజు అనే నినాదంతో ఆవిర్భవించిన రాష్ట్రీయ సమాజ్ పక్ష (ఆర్‌ఎస్‌పీ)ని తెలంగాణలో బలోపేతం చేస్తామని ఆ పార్టీ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు మహదేవ్ జీ జనకర్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కుటుంబ పాలన లేని రాజకీయాలే లక్ష్యంగా యువత, రైతులు, మహిళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్.కె రమాకాంత్‌ను నియమించినట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ సహ వ్యవస్థాపకుడు అక్కి. సాగర్, గోవింద్‌రామ్.ఎస్, నాయకులు డి.కతల్, అశోక్ కుమార్, అనిల్, రమేష్, నాయప్ప, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలు


ప్రకాశ్‌నగర్‌లోని ఓం శ్రీ స్వామి శరణం అయ్యప్ప మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

- బేగంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

మూసీ ప్రక్షాళనకు షరతులతో కూడిన మద్దతు

- కోట నీలిమ



సమావేశంలో పాల్గొన్న కోట నీలిమ తదితరులు

బంజారాహిల్స్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మూసీ నది ప్రక్షాళన, చెరువుల సంరక్షణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మేధావులు, పౌరసమాజం నుంచి కొన్ని షరతులతో కూడిన మద్దతు లభించిందని హక్కు ఇనిషియేటివ్ డైరెక్టర్ కోట నీలిమ అన్నారు. స్థానిక ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని, వాటి ఆధారంగా ప్రభుత్వం విధానాలను రూపొందించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో శనివారం డెమోలిషన్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై హక్కు ఇనిషియేటివ్ సమాలోచనల కార్యక్రమం నిర్వహిచారు. ఇందులో సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు పాల్గొని పలు సూచనలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. వీటిని నివేదికగా రూపొందించి ప్రభుత్వానికి అందచేయన్నుట్లు కోట నీలిమ వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ పద్మజ షా, కొడాలి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, అశోక్ భాషిన్, పంకజ్ అగర్వాల్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ లుబ్నా సార్వత్, డాక్టర్ అనంత్ మరిగంటి, రుబీనానఫీస్, సుజాత సూరేపల్లి పాల్గొన్నారు.

సినిమా వాళ్లకు చట్టాలు వర్తించవా?

- జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినిమా నటులు అయినంత మాత్రం చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సినిమా చూసేందుకు వెళ్లి అమాయక మహిళ ప్రాణాలను బలిగొన్న సినిమా నటులను అరెస్టు చేస్తే పెడబొబ్బలు పెడుతున్న రాజకీయ నాయకులు, మహిళ చనిపోయినప్పుడు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఎవరైనా చట్టాలకు అతీతులు కారనే విషయం రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండేవారికి తెలియంది కాదన్నారు. సినీ పరిశ్రమకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. యువతను పెడదారిపట్టించే సినిమాలు తియ్యడంపైనే అభ్యంతరం ఉందన్నారు. సీనియర్ నటుడు మోహన్‌బాబు విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. ఆయనపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సినీ నటుల విషయంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అంశాల్లో తప్పులేదన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే అభినందిస్తామన్నారు. విలువలతో కూడిన సినిమాలు తీసేవారికే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. సమాజాన్ని భ్రష్టు పట్టించే సినిమాలు తీసేవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పద్మజారెడ్డి

డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 1 లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను శనివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ కూచిపూడి నృత్యకారిని డాక్టర్ పద్మజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించి చేనేతకారులను ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ.. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ప్రదర్శన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ నెల 22 వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పీఈటీలకు పదోన్నతి కల్పించాలి


విద్యాశాఖ సంచాలకుడికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ పీడీ, పీఈటీల సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లుగా పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. శనివారం తెలంగాణ పీడీ, పీఈటీల సంఘం గౌరవ అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ నేతృత్వంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో సంచాలకుడితో పాటు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత లేని పీఈటీలను పీడీలుగా నియమిస్తే కాలపరిమితి విధించాలని కోరారు. కొత్త క్రీడా పాలసీలో భాగంగా ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు పీఈటీ పోస్టులను మంజూరు చేసి వాటి కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు క్రీడా నిధులను వెంటనే విడుదల చేయాలని, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబేర్, కోశాధికారి భాస్కర్, ప్రతినిధులు రామచంద్రుడు, కృష్ణ పాల్గొన్నారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

- ప్రతాని రామకృష్ణగౌడ్


యోగా స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ తదితరులు

బంజారాహిల్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయవచ్చని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5లో వర్తమాన్ యోగా స్టూడియోను, ఏరియల్ యోగాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన్ సంస్థ అనేక సంవత్సరాలుగా యోగాలో శిక్షణ ఇస్తుందని, పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. వర్తమాన్ యోగా ఫౌండర్ ఆదినారాయణ మాట్లాడుతూ.. వర్తమాన్ యోగా స్టూడియోలో శిక్షణ పొందే విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తామని, ఈ నెల 15, 16న ఏరియల్ యోగా, అడ్వాన్స్‌డ్ యోగాసనాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఖైరతాబాద్‌లో నేడు తాగునీటి సరఫరా బంద్

ఖైరతాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం నీటి సరఫరా ఉండదని రెడ్‌హిల్స్ సెక్షన్ మేనేజర్ నదీమ్ తెలిపారు. రెడ్‌హిల్స్‌లో లెవల్, హైలెవల్ ప్రాంతాలతో పాటు గన్‌ఫౌండ్రీ, ఘోడేకి కబర్, హిందీనగర్ ప్రాంతాల్లో నేడు నీటి సరఫరా ఉండదన్నారు. ఖైరతాబాద్‌లోని చర్చి గల్లీ, ఓల్డ్, న్యూ సీబీఐ క్వార్టర్స్, లక్ష్మీనగర్, పటేల్‌బస్తీ, శ్రీనివాసనగర్, నెహ్రూనగర్, మారుతీనగర్, బీజేఆర్ నగర్, మహాభారతనగర్, జాగీర్దార్ బాడ, బుడగజంగం బస్తీలలో సరఫరా ఉండదన్నారు. దీంతో పాటు బ్యాండ్‌లైన్, ఫూల్‌బాగ్, బషీర్‌బాగ్, బజార్‌ఘాట్, మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, సీతారాంబాగ్, హబీబ్‌నగర్, ఆగాపుర, మాన్‌గార్‌బస్తీ, బోయిగుడ కమాన్, ధోబీఘాట్, డి క్లాస్ క్వార్టర్లలో నీటి సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. రాదని తెలిపారు. సోమవారం తాగునీటి సరఫరా ఉంటుందన్నారు.

కల్వకుంట్ల కన్నారావు కారు సీజ్


బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన కన్నారావు కారు

బంజారాహిల్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న కల్వకుంట్ల కన్నారావు కారును బంజారాహిల్స్ పోలీసులు సీజ్ చేశారు. తనను కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేశాడని జయవర్ధనరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కన్నారావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో భాగంగా కన్నారావు వినియోగించిన కారును సీజ్ చేశారు. కాగా, ఈ కేసులో కన్నారావుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

ఎస్టీ కమిషన్ ఆదేశాలను అమలుచేయాలి

- పీఎం రవిశంకర్

బంజారాహిల్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల ఉద్యోగ ప్రమోషన్లలో జాతీయ కమిషన్ ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పీఎం రవిశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్ల విషయంలో జాతీయ ఎస్టీ కమిషన్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. దీనికి సబంధించి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నల్ సింగ్-2 కేసులో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన జడ్జిమెంట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలని రవిశంకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

డిప్యూటీ ఈఓ పోస్టులను భర్తీ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభ డిమాండ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కామన్ సర్వీస్ రూల్స్‌తో సంబంధం లేని హైదరాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఈఓఎస్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో శనివారం హైదరాబాద్ జిల్లా మహాసభ నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి సింహాచలం, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ శారద పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి ఉపాధ్యాయులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. ఎన్‌పీఎస్, ఎన్‌ఈపీ-2020లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో పాల్గొన్న శ్యాంకుమార్ తదితరులు

ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- ఖైరతాబాద్ మాల సంఘం అధ్యక్షుడు శ్యాంకుమార్

ఖైరతాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాలల గొంతుకగా నిలుస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే జి.వినోద్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఖైరతాబాద్ మాల సంఘం డిమాండ్ చేసింది. శనివారం ఖైరతాబాద్‌లో అధ్యక్షుడు బి.శ్యాంకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాలల సింహగర్జన విజయవంతం చేసిన మాలలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యాం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం తప్పకుండా ఆయనకు మంత్రి పదవి ఇస్తారనే నమ్మకంతో ఉన్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎలాంటి పోరాటానికైనా మాలలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



లాలాపేట్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో న్యూ కామన్ మెనూ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ వెంకటాచారి

కళాశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

● హైదరాబాద్ డీఆర్‌ఓ వెంకటాచారి

తార్నాక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కళాశాలస్థాయి నుండే నిర్ధిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్‌ఓ) వెంకటాచారి అన్నారు. శనివారం లాలాపేట్‌లోని ప్రభుత్వ బీసీ లేడీస్ హాస్టల్‌లో న్యూ కామన్ మెనూ డైట్ కార్యక్రమాన్ని హైద్రాబాద్ డీఆర్‌ఓ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో కలసి అధికారులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ఫుడ్ పాయిజనింగ్‌తో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు తలెత్తుతున్న అనారోగ్య సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, సంక్షేమ హాస్టళ్లలో చదువునభ్యసిస్తున్న విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్కువగా ఉండటం వల్ల సరైన పోషకాహారం అందటం లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ఇటీవల విద్యార్థులకు డైట్ చార్జీలతో పాటు, కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, యూఎల్‌సీ ప్రేమలత, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత, కృష్ణమాచారి, నర్సింహులు, సంజీవులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యను వివరిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

శ్మశానవాటికలోని సమస్యలను పరిష్కరించాలి: తలసాని

పద్మారావునగర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జీవైఆర్ కాంపౌండ్ పక్కనగల శ్మశానవాటికను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. శ్మశానవాటికలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10 వతేదీన కమిటీ సభ్యులు తలసానికి వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులకు లేఖను పంపారు. శ్మశానవాటికలో అవసరమైన సీసీ రోడ్లు, టాయిలెట్స్ తాగునీరు, చెత్తవ్యర్థాలను తొలగించటానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ కుర్మహేమలత, వెంటేశన్‌రాజు, ప్రేమ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.



మర్రి రాఘవయ్యను సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి : రాఘవయ్య

చిలకలగూడ, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. చిలకలగూడ, ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో శనివారం కార్మిక సంఘ రహస్య బ్యాలెట్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన సందర్భంగా మర్రి రాఘవయ్యని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రతినిధులు అభినందనలు తెలిపి శాలువ, పూలమాలతో సత్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపడతానని రాఘవయ్య వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా చార్యులు, ఉపాధ్యక్షుడు ఎ.జి.కె. మూర్తి, రాజేందర్, గోవిందరాజులు, బి.కె. సింగ్ పాల్గొన్నారు.

ఆ సెంటర్లలో టీచర్లే ఆయాలు

● మారేడుపల్లి మండలంలో అధ్వాన్నస్థితికి చేరుకున్న అంగన్‌వాడి సెంటర్లు

● పని ఒత్తిడితో స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్న టీచర్లు

● ఏడాది నుంచి అద్దె చెల్లించని ప్రభుత్వం

● సెంటర్లను ఖాళీ చేయాలని యజమానుల ఒత్తిడి

అడ్డగుట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే పిల్లల్ని బడికి అంగన్‌వాడి సెంటర్‌కు రప్పించాలి, భోజనం, పప్పు కూరలు వడ్డించాలి, గర్భిణులకు భోజనం పెట్టాలి, ఏ సెంటర్‌లో ఎంత మంది చిన్నారులు ఉన్నారన్న సమాచారం ప్రభుత్వ యాప్‌లో పొందుపరచాలి, ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగన్‌వాడి సెంటర్లలో జరిగే విశ్వసనీయ సమాచారం యాప్‌లో పొందుపరచాలి. ఏడాది కాలంగా సెంటర్లకు అద్దె చెల్లించడంలేదు. ఆయాలు లేక అంగన్‌వాడి సెంటర్ల టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మారేడుపల్లి మండలంలో (అడ్డగుట్ట డివిజన్) 14 అంగన్‌వాడి సెంటర్లు ఉండగా దాదాపు 90 శాతం సెంటర్ల అద్దె చెల్లించలేని పరిస్థితికి చేరుకుంది. మారేడుపల్లి మండలంలోని 14 సెంటర్లలో ఇదే పరిస్థితి. పలుచోట్ల ఆయాలు ఉంటే టీచర్లు ఉండరు.. టీచర్లు ఉంటే ఆయాలు ఉండరు. అన్ని చోట్ల దాదాపు ఇదే పరిస్థితి చోటుచేసుకుంది.



అంబేద్కర్‌నగర్ సెంటర్ 1లో తాళం వేసి ఉన్న అంగన్‌వాడి సెంటర్ బయట వేచి ఉన్న చిన్నారులు



శాస్త్రీనగర్ బస్తీలో అంగన్‌వాడి సెంటర్ బయట ఉన్న చిన్నారులు

స్వచ్ఛందంగా మానేసిన ఆయాలు, టీచర్లు

పనిఒత్తిడి తట్టుకోలేక అడ్డగుట్ట సెంటర్ టీచర్‌తో పాటు మరో టీచర్ ఈ మధ్యనే ఉద్యోగానికి రాజీనామా చేశారు. మరో వారం రోజుల్లో మరో ఇద్దరు టీచర్లు రాజీనామా చేస్తున్నట్లు సమాచారం. దీంతో సెంటర్లు మూసివేసే ప్రమాదం ఉంది. అడ్డగుట్ట డి సెక్షన్‌లో అంగన్‌వాడి సెంటర్‌లో 14 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. అద్దె ఇంటిలో ఉన్న ఈ సెంటర్‌కు ప్రతి నెల రూ. 1500, 10 నెలల నుంచి ఇంటి అద్దె చెల్లించకపోవడంతో యజమానులు సెంటర్‌ను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అంగన్‌వాడి సెంటర్‌కు తాళం వేయడంతో మరో వారం రోజులు అద్దె ఇస్తామంటూ గడువు ఇవ్వడంతో మళ్లీ తాళం తీసి చదువు చెబుతున్నారు. ఈ సెంటర్‌లో ఆయా లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంబేద్కర్‌నగర్ సెంటర్ 1లో 12 మంది చిన్నారులు ఉన్నారు. 10 నెలల నుంచి ఇంటి అద్దె ఇవ్వకపోవడంతో శుక్రవారం సెంటర్‌కు తాళం వేయడంతో పిల్లలు బయటకు వెళ్లి కూర్చున్నారు. అద్దె చెల్లిస్తామనడంతో వారం రోజులు గడువు తీసుకున్నారు. ఈ సెంటర్‌లో ఆయా పనులు కూడా టీచరే చూసుకుంటోంది. అడ్డగుట్ట శాస్త్రినగర్ బస్తీలో ఉన్న సెంటర్‌కు ప్రతి నెల రూ.3,000, పది నెలల నుంచి ఇంటి అద్దె చెల్లించకపోవడంతో సెంటర్ పలుచోట్ల మారాల్సి వస్తోంది. తుకారాంగేట్‌లోని గడ్డమీదిబస్తీలో ఉన్న అంగన్‌వాడి సెంటర్‌లో టీచర్ లేదు, ఆయా లేదు, ఇద్దరూ లేకపోవడంతో ఇన్‌చార్జీ టీచర్‌తో పాటు అడ్డగుట్ట డి సెక్షన్ లో పనిచేస్తున్న ఆయా ఇక్కడ ఇన్‌చార్జీలు ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు.

ఆయా పనులూ నేనే చూసుకుంటున్నా



తన సెంటర్‌లో ఐదేళ్ల నుంచి ఇంటి యజమాని అద్దె అడగడంలేదు. ఇక్కడ ఆయా లేకపోవడంతో అన్ని పనులు తానే చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం అంగన్‌వాడి సెంటర్లకు ఖరీదైన పుస్తకాలు అందించడంతో తమ సెంటర్‌లో చిన్నారులు ఆటలు పాటలు, చదువుపై శ్రద్ధ చూపిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వంట తానే చేయాలి. ఏడేళ్లుగా చదువు చెబుతున్నా.

వి. శోభ, మరాఠబస్తీ అంగన్‌వాడి టీచర్

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

మారేడుపల్లి మండల పరిధిలో అంగన్‌వాడి సెంటర్లలో అద్దెకు సంబంధించిన బిల్లు రాలేదు. ఇదే విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆయాలు, టీచర్ల కొరత ఉందని గత జూన్‌లో కొందరు పదవీ విరమణ చేశారు. వీరి స్థానంలో కొత్తగా రిక్రూట్ చేయలేదు. త్వరలో అన్ని సెంటర్లకు కొరత లేకుండా చూస్తాం. అద్దె ఇవ్వకపోవడంతో విద్యార్థులను బయటకు పంపించారన్న విషయం తెలిసింది. ఇంటి యజమానులతో మాట్లాడాం. కొంత సమయం కావాలని అడిగాం. వారు సరే అన్నారు.

\- సంధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పిల్లలకు మంచి తిండి పెట్టండి

● ఆహారం విషయంలో నాణ్యత పాటించండి

● కంటోన్మెంట్ మైనార్టీ హాస్టళ్ల నిర్వాహకులతో అధికారులు



కంటోన్మెంట్‌లోని మైనార్టీ హాస్టల్ వంటశాలను తనిఖీ చేస్తున్న శశాంక, ఎక్సైజ్ అధికారి

బోయిన్‌పల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్లలో ప్రభుత్వం ఒకే విధమైన మెనూను అమలు చేస్తుందని, ఇందుకోసం విద్యార్థులకు కొత్త మెనూ ప్రారంభించిందని, స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్, కొత్త పథకాల పర్యవేక్షణాధికారి శశాంక అన్నారు. గురుకులాల బాట కొత్త మెనూ ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని బాపూజీ నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ గురుకుల ఆశ్రమ పాఠశాలను వ్యవసాయ సహకార అధికారి, ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు సందర్శించగా బోయిన్‌పల్లి మల్లికార్జునకాలనీలో గల కంటోన్మెంట్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను శశాంక, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, టీజీఎంఆర్ ఫైనాన్స్ అధికారి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. బాలికల తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల ఆశ్రమ పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్‌లు శనివారం సందర్శించి కొత్త మెనూను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అధికారులు వసతి గృహం, బాత్ రూమ్, తినుబండారాలను, మంచినీటి ప్లాంట్‌ను, హోటల్ వంటశాలను పరిశీలించారు. ఈ క్రమంలో వంట చేసేవారి వివరాలు తెలుసుకుంటూ వంటచేస్తున్న విధానంను ఆయన స్వయంగా పరిశీలించి నిల్వ ఉంచిన బియ్యం, పప్పు, ఉప్పు వంట నూనె, నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలను పరిశీలించారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఆహార భద్రతపై అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిత్యావసర వస్తువులు నాణ్యమైనవిగా ఉండేలా చూడాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కోడిగుడ్లు ఉడికించిన అర్ధగంటలోపే అందించాలని సూచించారు. మంచినీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ సరదాగా గడిపారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు.

బోయిన్‌పల్లి హాస్టల్‌ను సందర్శించిన ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు

గురుకులాల్లో కొత్త మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని గురుకుల ఆశ్రమ పాఠశాలను ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు పాఠశాల ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ ఎల్లమ్మతో కలిసి సందర్శించారు. హాస్టల్‌లోని అన్ని వసతులను, నిత్యావసర వస్తువులను, తరగతి గదులలోని డిజిటల్ బోర్డులను పరిశీలించారు. విద్యాబోధనలపైన ఆరాతీశారు.



వేడుకల్లో పాల్గొన్న కొంతం దీపిక

ఘనంగా శ్రీదత్త జయంతి మహోత్సవాలు

మారేడుపల్లి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి శ్రీసుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదత్త జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీదత్త సాయి అభిషేకం, శ్రీదత్త సాయి హోమం, మధ్యాహ్నం అన్నదాన ప్రసాదం, సాయంత్రం శ్రీదత్తసాయి రథోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆలయ ఈఓ అరుణ కుమారి, చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బౌద్ధనగర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం కనులపండువగా సాగింది. ఆలయ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్ఛరణలతో శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంను అంగరంగవైభవంగా నిర్వహించారు. మూలవిరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి వివిధ రకాల పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణంను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీసభ్యులు బిట్ల రఘునందన్, పాతూరి మల్లేష్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్ని వెంటనే పరిష్కరించుకోవాలి

● అర్జీదారులకు న్యాయం చేసేందుకు జడ్జీల పాత్ర గొప్పది

● వై.వసంత్ కుమార్



లోక్ అదాలత్‌లో పరిష్కార పత్రాన్ని అందజేస్తున్న జడ్జీలు

అడ్డగుట్ట, డిసెంబరు 14 (ఆంజ్యోతి): పెండింగ్ కేసుల్ని వెను వెంటనే పరిష్కరించుకోవాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు జడ్జీలు అర్జిదారులకు సూచించారు. లోక్ అదాలత్ కార్యక్రమాలు అర్జీదారుల కోసమే ఉన్నాయని ఎవరు కూడా కేసుల్లో జాప్యం చేసుకోకుండా లోక్ అదాలత్ కార్యక్రమంలో ఇరువురు పరిష్కారం చేసుకునేందుకు ముందుకు రావాలని జడ్జీలు సూచించారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్ కోర్టు ప్రాంగణంలో వివిధ సివిల్ క్రిమినల్ కోర్టులో అనేక కేసులు పరిష్కరించబడ్డాయని జడ్జీలు తెలిపారు. సికింద్రాబాద్ సివిల్ కోర్టులో 18వ ఏసీఎంఎం కోర్టులో 8 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా 46 చెక్ బౌన్స్‌లు పరిష్కారమయ్యాయి. 19వ ఏసీఎంఎం కోర్టులో 72 కేసులు, 20వ ఏసీఎంఎం కోర్టులో 60, 22వ ఏసీఎంఎం కోర్టులో 62, 11వ ఏసీఎంఎం కోర్టులో 61 బ్యాంక్ 47 క్రిమినల్ కేసులు, 10వ ఏసీఎంఎం కోర్టులో 140 క్రిమినల్ కేసులు, సివిల్ యాక్సిడెంట్ కేసులు, ఎంవీఓపీ 65 కేసులు, వివిధ కేసుల్లోని నష్టపరిహారం కింద రూ 6.1. కోట్లు పరిష్కారం అయ్యాయి. ముఖ్యంగా బ్యాంకుకు సంబంధించిన పీఎల్‌సీ కేసులు 54, బ్యాంకు రుణాల ద్వారా రుణదారులు రూ.79.93 లక్షలు నగదు చెల్లించే విధంగా కేసులు పరిష్కారం అయ్యాయి. అదే విధంగా సివిల్ కేసులు సైతం ఇక్కడ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యాయని సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్, ఉపాధ్యక్షుడు రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు శ్రీవాణి, వీరయ్య, ప్రశాంతి, ఆశాలత, దేవి మానస, సంకీత మిత్ర, గౌస్‌పాషా లతో, శరిష, అరుణ; బార్ అసోసియోషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్, ఉపాధ్యక్షుడు రమణతో పాటు లోక్ అదాలత్ సభ్యులు, బార్ అసోసియోషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్ పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్

ప్రభుత్వ పాఠశాలలో బోర్‌వెల్ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ మూడోవార్డు బలంరాయి నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల్లో శనివారం పవర్‌బోర్‌వెల్ పనులను కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్, బోర్డుమాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల మెరుగుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం జంపన ప్రతాప్ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు నీటి సమస్యను తనదృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే గణేశ్ కి తెలిపానన్నారు. ఎమ్మెల్యే చొరవతో పవర్‌బోర్‌వెల్ ఏర్పాటవుతుందని, ఈ సందర్భంగా గణేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు బెంచీలు ఇతర సామగ్రి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.అరుణకుమారి, నాగరత్నలీలాబాయి, దేవిక, నాయకులు రాజేష్ యాదవ్, దుర్గారవి, సాయిరెడ్డి, వెంకట్, కస్తూరి, మహేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న వెంకటేష్ నాయక్

యోగా టోర్నమెంట్‌లో వెంకటేష్ నాయక్ ఎన్నిక

అడ్డగుట్ట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో శనివారం జరిగిన ఇంటర్ విశ్వవిద్యాలయం యోగా కాంపిటేషన్ (మహాత్మగాంధీ విశ్వవిద్యాలయంలో) జరిగిన సెలక్షన్‌లో సికింద్రాబాద్ తుకారాంగేట్‌కు చెందిన వెంకటేష్ నాయక్ ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ యోగా కాంపిటేషన్‌కు సెలెక్ట్ అయ్యాడు. తన గురువు సాయిబాబా నేతృత్వంలో సాధన చేయడంతోనే ఆల్ ఇండియాకు సెలెక్ట్ కావడం తమ గురువే కారణమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాల అర్హతకు సర్టిఫికెట్లు అవసరం: రఘు

బౌద్ధనగర్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పథకాల అర్హతకు వివిధ రకాల సర్టిఫికెట్లు ఎంతగానో అవసరపడతాయని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశబోయిన రఘు అన్నారు. గతకొన్ని రోజుల క్రితం గంగపుత్రకులస్తులు నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రొవిజనల్ సర్టిఫికెట్ కార్డు, ఈ శ్రమ్ కార్డ్ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ హ్యాండ్ ఎంప్లాయిమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కార్డ్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ మూడు రకాల కార్డులకు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో అర్హత సాధించిన సుమారు 900 మంది గంగపుత్ర కులస్తులకు శనివారం వారాసిగూడలో కేంద్రప్రభుత్వ ఉద్యోగులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ రాజుయాదవ్, వంగల సుధాకర్, దామోర సదానంద్, శివ, నవీన్, రాజ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, డాక్టర్ చేతిరఘు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మజ్దూర్ యూనియన్ గుర్తింపు పత్రాన్ని శంకర్‌రావుకు అందజేస్తున్న రైల్వే జీఎం జైన్

ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో 'మజ్దూర్' కు మొదటి స్థానం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ , డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సికంద్రాబాద్ జోన్ వ్యాపితంగా నిర్వహించిన ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ అధిక్యం ప్రదర్శించి మొదటి స్థానంలో నిలిచిందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకర్‌రావు తెలిపారు. ఈ క్రమంలో శనివారం రైల్ నిలయంలోని రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ చేతుల మీదుగా ట్రేడ్ యూనియన్ గుర్తింపు పత్రాన్ని తనకు అందజేశారన్నారు. ఎన్నికల్లో మొదటి స్థానంలో నిలిచినందుకు రైల్వే జీఎం యూనియన్‌నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. జీఎంను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు మురళీధర్, అసిస్టెంట్ ప్రధాన కార్యదర్శి ఉదయ బాస్కర్, కోశాధికారి సరోజిని రెడ్డి, డివిజనల్ కార్యదర్శి రవీందర్, సంజీవయ్య బుచ్చిరెడ్డిలతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేదల వైద్యసేవలకు సహకారం: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ అసెంబ్లీకి చెందిన సుమారు 52 మంది లబ్ధిదారులకు రూ.27లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మంచివైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ప్రస్తుత రోజుల్లో వివిధ మార్గాల్లో వారిని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కందిశైలజ, సునీత, లక్ష్మీప్రసన్న, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు బెజ్జంకిరాజేశ్, మేడిశెట్టి బాలాజీ, మురళీ, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.